







యజ్ఞవరాహస్వామికి వివిధ సేవలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 37వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాతం, కొలువు, తోమాలసేవ, కుంభారాధన, నిత్యహోమం నిర్వహించారు. వటపత్రశాయి అలంకరణలో శ్రీవారికి సూర్యప్రభ వాహనసేవ నిర్వహించగా వేదపండితులు అరుణ, ఆదిత్యహృదయ పారాయణాలు చేశారు. అనంతరం పూలంగిసేవ, అన్నకూటోత్సవం, అష్టదళపాదపద్మారాధన కన్నుల పండువలా జరిపారు. సాయంత్రం మహాశాంతి హోమం, సహస్ర దీపాలంకరణ సేవ నేత్రపర్వంగా సాగింది. రాత్రి గజవాహనంపై శ్రీవారు ఆలయ మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తూ కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నేడు శనివారం ఉదయం రథోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగియనున్నాయి.



మంత్రి గంగుల ఇంటింటి ప్రచారం



కమలాకర్‌ను గొంగడి, గొర్రెతో సత్కరిస్తున్న గొల్లకుర్మలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం నాగులమల్యాల, కొత్తకొండాపూర్, ఖాజీపూర్, ఐలవోనిపల్లెల్లో బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతిలో పెట్టొద్దంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే పల్లెల రూపురేఖలు మారాయన్నారు. అనునిత్యం అందుబాటులో ఉంటూ స్థానికంగా నీరు, కరెంటు తెచ్చి రోడ్లు వేయించి, వాటి మరమ్మతును సైతం చేయిస్తూ మీ సేవకే అంకితమయ్యాయని తెలిపారు. కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధిపథంలో నడుస్తోందని, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ పిల్లి శ్రీలతమహేశ్, జెడ్పీటీసీ పిట్టల కరుణరవీందర్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, జెడ్పీ కోఆప్షన్‌సాబీర్ పాషా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు ప్రసాద్, రాజమ్మ, ఎంపీటీసీ కొమ్ము హేమలత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కొత్తపల్లి మండలం చింతకుంట పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో వార్డు సభ్యులతో పాటు పలువురు యువకులు శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఖాజీపూర్ గ్రామ అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు కూడా బీఆర్‌ఎస్‌లో చేరారు.

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.కేశవరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కోశాధికారి పి.శ్రీహరిరెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎంఎల్ఎన్‌రెడ్డి, డీడబ్ల్యూవో సరస్వతి, సీడీపీవో ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

5న త్రైక్వాండో, 6న బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల, కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 5న త్రైక్వాండో, 6న బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలను కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాలల, కళాశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు అర్హత ధ్రువీకరణ పత్రాలతో స్టేడియంలో రిపోర్టు చేయాలని పూర్తి వివరాలకు 9346120205 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కరీంనగర్‌క్రైం: నగరంలోని కోతిరాంపూర్ పోచమ్మవాడలో పేకాటస్థావరంపై శుక్రవారం దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్‌రూరల్: కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సీఈవో రమేశ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 200 క్వింటాళ్ల ధాన్యం తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి శ్రీనివాస్, రైతులు రమణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట, బద్దిపల్లి, ఖాజీపూర్, మల్కాపూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, ఏవో రంజిత్‌కుమార్‌లు ప్రారంభించారు. ఏఈవోలు రాజేంద్రప్రసాద్, రాము, లలిత, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సీఈవో రమేశ్



కేంద్రం ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు

ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కరీంనగర్‌కార్పొరేషన్: ఈనెల 30వ తేదీన జరిగే పోలింగ్‌లో ప్రతీఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి అన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం, పోలింగ్ శాతం పెంచడం లక్ష్యంగా శుక్రవారం నగరపాలక సంస్థ ఆవరణలో ప్రభుత్వ కళాజాత బృందాలు ప్రదర్శన నిర్వహించాయి. ఓటు విలువను తెలియచేస్తూ కళాబృంద సభ్యులు పాటలు, నృత్యాల రూపంలో ఇచ్చిన ప్రదర్శనను ఉద్యోగులు, సందర్శకులు తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలకసంస్థలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందిలతో పాటు సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి

బీఆర్‌ఎస్‌లో చేరిక



కరీంనగర్: నగరంలోని 10, 32వ డివిజన్‌ల నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు యువకులు శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న వాసుదేవారెడ్డి

కరీంనగర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ వరి కోతలు మొదలై 25 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. చేతికొచ్చిన పంటను దిక్కు లేక తక్కువ ధరకు ప్రైవేటు రైస్‌మిల్లర్లకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఓవైపు వాతావరణ శాఖ పక్క రాష్ట్రానికి వర్షసూచన చెబుతుందని, వెంటనే అధికారయంత్రాంగం ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోలు చేయాలని అన్నారు. రైతులకు కనీస సౌకర్యాలైన గన్నీ సంచులు, సుతిలి, మంచినీటి సౌకర్యం, టెంట్లు వేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతాంగాన్ని ఐక్యం చేసి ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి



నారాయణగౌడ్‌కు నియామకపత్రం అందిస్తున్న రాంరెడ్డి

కరీంనగర్‌రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బుర్ర నారాయణగౌడ్‌కు నియామకపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, నాయకులు దాసరి నర్సింహారెడ్డి, న్యాలం రాజు, జగ్గాని కనుకయ్య, బుర్ర స్వామి, తిరుపతి, శ్రీకాంత్‌రెడ్డి, శంకరయ్య, సతీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బండి సంజయ్ మాటలు నమ్మే స్థితిలో లేరు'

కరీంనగర్: ఎంపీ బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శుక్రవారం మీసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెంటిమెంట్ రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టి యువతను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన సంజయ్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, నాయకులపై అడ్డగోలు విమర్శలు చేస్తూ దిగజారి మాట్లాడటం ఆయనకే చెల్లిందని విమర్శించారు. కరీంనగర్ ప్రజలను ఓట్లు అడిగే సాహసం చేయక స్టార్ క్యాంపెయిన్ పేరిట హెలికాప్టర్‌లో రాష్ట్రం తిరుగుతానని అంటున్న బండి సంజయ్‌కు డిపాజిట్ గల్లంతు చేసి బైబై చెప్పనున్నారని అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్‌ఎస్ నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కుల్‌దీప్‌వర్మ, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, గంగాధర చందు, ఆరె రవి, చేతి చంద్రశేఖర్, వంగ హరీశ్, సత్తినేని శ్రీనివాస్, నాగుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

మంత్రి కుటుంబసభ్యుల ప్రచారం



చెర్లభూత్కూర్‌లో ఓటువేయాలని కోరుతున్న మంత్రి కమలాకర్ సతీమణి రజిత



వృద్ధదంపతులకు కరపత్రం అందిస్తున్న మంత్రి కమలాకర్ సోదరుడు సుధాకర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి సతీమణి రజిత, సోదరుడు సుధాకర్, వదిన శారదల ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మూడు బృందాలుగా ఏర్పడి ఇంటింటా ప్రచారం చేశారు. మంత్రి కమలాకర్ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను చూసి బీఆర్‌ఎస్‌కు ఓటేయాల్సిందిగా కోరారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కూర శ్యాంసుందర్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, తిరుపతియాదవ్, కిరణ్, సతీశ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా కృతజ్ఞత సమావేశం

కరీంనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా శుక్రవారం నగరంలోని 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డుకాలనీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జాజుల మోహన్‌రావు అధ్యక్షతన కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్ హాజరై మాట్లాడుతూ గంగుల కమలాకర్ కాలనీకి చేసిన అభివృద్ధికి కృతజ్ఞతగా రాబోయే ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో డివిజన్ పరిధిలోని శివాలయం అభివృద్ధి, 24గంటల నీటి సదుపాయాలు, 100 పడకల ఆస్పత్రి, ఇండోర్ స్టేడియం లాంటి పనులు సాధించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాశ్

బీజేపీలో చేరిన కేశవరెడ్డి

కరీంనగర్‌టౌన్: తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు రొంటాల కేశవరెడ్డి బీజేపీలో చేరారు. శుక్రవారం రేకుర్తిలోని సాయి మహాలక్ష్మీ గార్డెన్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. మరోవైపు భాగ్యనగర్ 17వ డివిజన్‌కు చెందిన వందలాది మంది యువకులు శుక్రవారం ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పరశురాం, సురేశ్, రాజేశం, సంపత్, లక్ష్మణ్, పోచయ్య, శేఖర్, శివరాం, అనిల్, అజయ్, సాయికృష్ణ, కార్తీక్, రాజు, చందు, రమేశ్, సాయి కుమార్, భరత్ తదితరులున్నారు.



కేశవరెడ్డికి కండువా కప్పుతున్న సంజయ్

పంచాయతీలపై విద్యుత్ బిల్లుల భారం

- బకాయిలతో సర్పంచుల ఆందోళన
- కరీంనగర్‌మండలంలో రూ.47లక్షల విద్యుత్‌బకాయిలు
- వసూళ్ల కోసం నోటీసులు జారీ

కరీంనగర్‌రూరల్: 'నగునూరు మేజర్ గ్రామపంచాయతీ కావడంతో వివిధ రకాలుగా వచ్చే ఆదాయంతో పారిశుధ్య పనులు, కార్మికుల వేతనాలతో పాటు విద్యుత్‌బిల్లులు చెల్లించే అవకాశముంది. అయితే పంచాయతీ నిర్వహణ వ్యయం పెరిగిపోవడంతో కరెంట్ బిల్లు సక్రమంగా చెల్లించక బకాయిలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం రూ.14లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ సమస్య ఒక్క నగునూరు గ్రామపంచాయతీది మాత్రమే కాదు కరీంనగర్ మండలంలోని మిగితా 16 పంచాయతీల పరిస్థితి'. పంచాయతీలకు వచ్చిన సీజీఎఫ్ నిధులతోనే కరెంట్ బిల్లులు చెల్లించాలని అధికారులు పేర్కొంటుండగా సర్పంచులు ససేమిరా అంటున్నారు. సీజీఎఫ్ నిధులు పంచాయతీల నిర్వహణకు, చేసిన అభివృద్ధి పనుల బిల్లుల చెల్లించేందుకు సరిపోవట్లేదని ఇక కరెంట్ బిల్లులు చెల్లిస్తే నిర్వహణ మరింత కష్టంగా మారుతుందని పలువురు సర్పంచులు వాపోతున్నారు.



నగునూరు గ్రామపంచాయతీ కార్యాలయం

రూ. 47 లక్షల విద్యుత్ బకాయిలు

కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం రూ.47 లక్షల వరకు విద్యుత్ బిల్లుల బకాయిలున్నాయి. ఫిబ్రవరి నెల నుంచి సెప్టెంబరు వరకు రూ.6,569,087 విద్యుత్ బకాయిలుండగా ఇటీవల రూ.1,780,616 చెల్లించారు. ఇంకా రూ.4,788,471 బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఎస్‌జీఎఫ్ నిధులు వచ్చినన్ని రోజులు ప్రతీ నెల విద్యుత్ బిల్లులు చెల్లించారు. అయితే గత 11 నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో సర్పంచులు బిల్లులు చెల్లించడం లేదు. అయితే అధికారులు మాత్రం ఆగస్టులో పంచాయతీలకు మంజూరైన సీజీఎఫ్ నిధులు రూ.44లక్షల నుంచి తప్పనిసరిగా విద్యుత్ బిల్లులు చెల్లించాలని మౌఖిక ఆదేశాలు జారీచేశారు. కొన్ని పంచాయతీలకు చెందిన సర్పంచ్, ఉప సర్పంచుల డిజిటల్ కీ ఉపయోగించి అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా విద్యుత్ బిల్లులను చెల్లించడం వివాదాస్పదంగా మారింది.

పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు నోటీసులు

విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించడంలో కొందరు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో బకాయిలు పెరిగిపోతున్నాయి. అత్యధికంగా నగునూరు రూ.14లక్షలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు అధికంగా ఉన్న నగునూరు, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, చామనపల్లి, నల్లగుంటపల్లి తదితర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సీసీ చార్జీలను చెల్లించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీసీ చార్జీలు చెల్లించాలి

గ్రామపంచాయతీలకు వచ్చిన సీజీఎఫ్ నిధుల నుంచి సీసీ చార్జీలు చెల్లించాలి. విద్యుత్ బకాయిలు పెరిగిపోతే పంచాయతీలపై మరింత భారం పెరుగుతోంది. ప్రతినెలా కొంత మొత్తంలో విద్యుత్ బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలి.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీవో, కరీంనగర్‌రూరల్

బిల్లులు చెల్లించి సహకరించాలి

గ్రామపంచాయతీలకు చెందిన విద్యుత్ బిల్లులను సర్పంచులు సకాలంలో చెల్లించాలి. లక్షల్లో బకాయిలు పేరుకపోవడంతో వసూళ్లు చేసేందుకు ఇబ్బందవుతోంది. ప్రభుత్వ నిధులు మంజూరు చేసిన వెంటనే బిల్లులు చెల్లించి విద్యుత్ సంస్థ మనుగడకు సహకరించాలి.

– కె.రాజు, ఏడీఈ, కరీంనగర్‌రూరల్

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

కరీంనగర్‌క్రైం: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని టౌన్ ఏసీపీ జి.నరేందర్ అన్నారు. శుక్రవారం నగరంలోని గాంధీ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. రూ.1,131 లక్షలు పట్టుబడ్డాయి. కరీంనగర్ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సమస్యలు పరిష్కారం

విద్యానగర్(కరీంనగర్): బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు నర్సింగరావు పాల్గొన్నారు.

విజయపురికాలనీలో కార్డెన్ సెర్చ్

కొత్తపల్లి: ఎన్నికల సందర్భంగా రేకుర్తిలోని విజయపురికాలనీలో కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, కరీంనగర్‌రూరల్ ఎస్ఐలు, కొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు చెందిన సిబ్బందితో కలిసి శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా సోదాలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రమైన రేకుర్తిలోని ప్రాంతంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజలకు ఎన్నికల నియమనిబంధనలు, ఎన్నికల నియామాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు